మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి పరామర్శ

సూర్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

ఆత్మకూర్.ఎస్, ఫిబ్రవరి 21: మండలంలోని రామోజీతండా పరిధి బంగ్లా తండాకు చెందిన గుగులోతు సూర్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. సూర్య కుటుంబాన్ని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తూడి నర్సింహారావు, సింగిల్ విండో చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ ముద్దం కృష్ణారెడ్డి, నాయకులు కసగాని బ్రహ్మంగౌడ్, బత్తుల ప్రసాద్, మండల యూత్ అధ్యక్షుడు తంగెళ్ల మధుసూదన్‌రెడ్డి, గునగంటి భిక్షం, బొల్ల వెంకటరెడ్డి, బషీర్, తంగెళ్ల శ్రీనివాస్ రెడ్డి, గుండాల నాగరాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు బొడ్రాయి పునఃప్రతిష్ఠ ఆహ్వానం

మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌కు ఆహ్వాన పత్రికను అందిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

నాగారం, ఫిబ్రవరి 21: మండలంలోని శాంతినగర్ గ్రామంలో మార్చి 23, 24 తేదీల్లో జరిగే బొడ్రాయి పునఃప్రతిష్ఠ, ముత్యాలమ్మ పండుగకు హాజరుకావాలని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిశోర్‌కుమార్‌ను ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. శుక్రవారం నేరుగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి : తాసీల్దార్

సమావేశంలో మాట్లాడుతున్న తాసీల్దార్ ఆంజనేయులు

మునగాల, ఫిబ్రవరి 21: మండలంలోని గ్రామాల్లో వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తాసీల్దార్ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం తాసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏయే గ్రామాల్లో నీటి కొరత ఉందో ముందస్తుగా గుర్తిస్తే వేసవిలో నీటి ఎద్దడిని అధిగమించవచ్చని తెలిపారు. ఎంపీడీఓ రమేశ్ దీన్‌దయాల్, ఇరిగేషన్ డీఈ ఆనంద్, ఏఈ రుత్విక్, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

నేరేడుచర్లలో పట్టపగలు చోరీ

- ఏడున్నర తులాల బంగారు ఆభరణాల అపహరణ

నేరేడుచర్ల, ఫిబ్రవరి 21: నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధి 5వ వార్డులోని నర్సయ్యగూడెంలో శుక్రవారం పట్టపగలే చోరీ జరిగింది. ఎస్ఐ రవీందర్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. నర్సయ్యగూడెంలో నివాసం ఉంటున్న పేరం వెంకన్న, భార్య లింగమ్మ ఇంటికి తాళం వేసి కూలి పనికి వెళ్లారు. ఇదే అదునుగా భావించి గుర్తు తెలియని వ్యక్తులు ఇద్దరు ఇంట్లోకి ప్రవేశించి బీరువా తాళం పగులగొట్టి 7.5 తులాల బంగారు ఆభరణాలను అపహరించారు. బాధితుడు వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ తెలిపారు.

పాలకవీడు మండలంలో రెండు చోట్ల..

పాలకవీడు: మండలంలోని కల్మటితండా, గుడుగుంట్లపాలెం గ్రామాల్లో శుక్రవారం పట్టపగలే చోరీలు జరిగాయి. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్మటి తండా గ్రామానికి చెందిన బాణావత్ సైదా ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రెండు తులాల బంగారు ఆభరణాలు, రూ.60 వేల నగదు అపహరించారు. అదేవిధంగా గుడుగుంట్ల పాలెం గ్రామంలో గుండ్ర శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తి ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి బీరువా తాళాలు పగులగొట్టి 12 తులాల వెండి, తులం బంగారు ఆభరణాలు దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

గరిడేపల్లి మండలంలో..

గరిడేపల్లి: మండలంలో దొంగలు హల్‌చల్ చేశారు. శుక్రవారం ఒకేరోజు మూడు చోట్ల దొంగతనాలకు పాల్పడ్డారు. ఎస్ఐ నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అప్పన్నపేట గ్రామానికి చెందిన సోమగాని లక్ష్మి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బీరువాలోని 17 గ్రాముల బంగారం, 10 తులాల వెండి పట్టీలు, రూ.50 వేల నగదు అపహరించారు. అదేవిధంగా గడ్డిపల్లి గ్రామానికి చెందిన కర్ణం నగేశ్ ఇంట్లో రెండు తులాల బంగారం, కోన శ్రీను ఇంట్లో రూ.36 వేలు నగదు చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన

నూతనకల్, ఫిబ్రవరి 21: మండల పరిధి చిల్పకుంట్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు శుక్రవారం అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బత్తుల ఉపేందర్ చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని చిన్నారులు, గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే పుట్టబోయే శిశువులు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.

ఫీజుల పేరుతో విద్యార్థులకు వేధింపులు : ఎస్ఎఫ్ఐ

ఎస్వీ డిగ్రీ కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 21: కళాశాలలో చేరినప్పుడు విద్యార్థులతో చేసుకున్న ఒప్పందానికి భిన్నంగా ఫీజులు చెల్లించాలని జిల్లా కేంద్రంలోని ఎస్వీ డిగ్రీ కళాశాల యాజమాన్యం వేధింపులకు గురి చేస్తున్నదని ఆరోపిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాల ఎదుట విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్‌వర్మ మాట్లాడుతూ.. కళాశాల యాజమాన్యం ఉపకార వేతనం ద్వారా విద్యాబోధన చేస్తామని చెప్పి ఫుడు ఫీజులు చెల్లించాలని విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులను పరీక్షల్లో ఫెయిల్ చేస్తామని బెదిరింపులకు గురి చేయడంతో మానసిక ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అక్కినపల్లి వినయ్, శ్రీరామ్, దీపిక, రేణుక, బారీ అశోక్, కీర్తి, దేవిప్రియ, రాహుల్, సతీశ్, అప్రోజ్, విఘ్నేశ్వర్, శివ, భరత్, నాగరాజు, గణేశ్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషపై మక్కువ పెంచుకోవాలి : ఎంఈఓ

కోదాడ రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ సలీంషరీఫ్

కోదాడ రూరల్, ఫిబ్రవరి 21: విద్యార్థులు మాతృభాషపై మక్కువ పెంచుకోవాలని ఎంఈఓ ఎండీ. సలీంషరీఫ్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు మాతృభాషలో బోధిస్తే సమాచారాన్ని సులభంగా అర్థం చేసుకోగలుగుతారని పేర్కొన్నారు. పరభాష మోజులో మాతృభాషను మరువకూడదని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం డి.మార్కండేయ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రావుల స్వరూప్, కొణతం వెంకటరెడ్డి సహకారంతో నేరేడుచర్ల జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జిలకర రామస్వామి, చల్లా ప్రభాకర్ రెడ్డి, గుండ్రెడ్డి సైదిరెడ్డి, కర్రి సూర్యనారాయణ రెడ్డి, సరికొప్పుల నాగేశ్వరరావు, చిత్రం విశ్వనాథం, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, ఫిబ్రవరి 21: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై పీఓ, ఏపీఓ, ఓపీఓ, మైక్రో అబ్జర్వర్లకు నిర్వహించిన శిక్షణలో అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఫిబ్రవరి 26న ఉదయం 7 గంటల వరకు సిబ్బంది బ్యాలెట్ పంపిణీ కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. అక్కడ తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఓటర్ల జాబితా, బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్స్‌లు, ఎన్నికల సామగ్రి వంటివి అన్ని ఉన్నాయో లేవో జాగ్రత్తగా పరిశీలించి నిర్ధారణ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీనివాసరాజు, డీటీ వేణు, ఎన్నికల ట్రైనర్లు రమేశ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు..

జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఎమ్మెల్సీ ఎన్నికలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి పి.సుదర్శన్ రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. జిల్లాలో 23 పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశామని వివరించారు.

తాగునీటి సరఫరాలో సమస్యలు లేకుండా చూడాలి..

సూర్యాపేట టౌన్: వేసవిలో సూర్యాపేట పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మిషన్ భగీరథ(గ్రిడ్), ఇంట్రా, పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులు, 48 వార్డుల నీటి సరఫరా లైన్‌మెన్లతో రివ్యూ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు సమన్వయంతో పనిచేసి నీటి సరఫరాలో తలెత్తుతున్న సమస్యలను 20 రోజుల్లోగా పరిష్కరించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్, పబ్లిక్ హెల్త్ ఈఈ సత్యనారాయణ, ఇంట్రా ఈఈ కరుణాకర్‌రెడ్డి, గ్రిడ్ ఈఈ శ్రీనివాసరావు, ఏఈలు రాజురెడ్డి, తిరుమలయ్య, నరేందర్, ఆర్ఓ కల్యాణి పాల్గొన్నారు.

మహాశివరాత్రి జాతరకు పటిష్ట బందోబస్తు : ఎస్పీ

మేళ్లచెర్వు శివాలయ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 21: మండల కేంద్రంలోని స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 26 నుంచి మార్చి 2వ తేదీ వరకు జరుగనున్న మహాశివరాత్రి జాతరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. శుక్రవారం ఆలయాన్ని సందర్శించిన ఎస్పీ.. జాతర ఏర్పాట్లపై ఈఓ కొండారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. జాతర బందోబస్తులో భాగంగా 600 మంది సిబ్బందితో పాటు షీ టీమ్స్, 65 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు భక్తులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కోదాడ రూరల్ సీఐ రజితా రెడ్డి, ఎస్ఐ పరమేశ్, ఆలయ చైర్మన్ శంభిరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ గోపికృష్ణ

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 21: సైబర్ మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ గోపికృష్ణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేజీబీవీలో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, డ్రగ్స్ నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. ఎస్ఓ మణెమ్మ, హెడ్ కానిస్టేబుల్ మురళీధర్‌రెడ్డి, పోలీసు కళాబృందం సభ్యులు ఎల్లయ్య, గోపయ్య, గురులింగం, కృష్ణ, నాగార్జున, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేసవిలో నర్సరీల్లోని మొక్కలను కాపాడాలి : ఎంపీడీఓ

నాగిరెడ్డిగూడెంలో నర్సరీని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ లక్ష్మి

పాలకవీడు, ఫిబ్రవరి 21: వేసవిలో వన నర్సరీల్లోని మొక్కలను జాగ్రత్తగా కాపాడాలని ఎంపీడీఓ లక్ష్మి ఆదేశించారు. శుక్రవారం మండలంలోని నాగిరెడ్డిగూడెం గ్రామ నర్సరీని, అంగన్‌వాడీ పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో రిజిస్టర్లను, బాలింతలు, చిన్నారులకు అందజేసిన పౌష్టికాహారానికి సంబంధించిన వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

'మై హోం' ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

మందులను పంపిణీ చేస్తున్న వైస్ ప్రెసిడెంట్ ఉత్తమ్‌సింగ్

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 21: స్థానిక మైహోం సిమెంట్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని వేపలమాధవరం ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు . ఈ శిబిరాన్ని పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ ఉత్తమ్‌సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యూరో, జనరల్, ఎముకలు, కీళ్లు, చిన్నపిల్లల వైద్యులు 570 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. టీబీ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ జీఎం నాగేశ్వరరావు, మైన్స్ డీజీఎం అప్పలరాజు, ఏజీఎంలు నరేశ్, శ్రీనివాస్, రత్నం, హెల్త్ ఆఫీసర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలి'

తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

అర్వపల్లి, ఫిబ్రవరి 21: రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని, రైతు భరోసా నిధులు జమ చేయాలని, వరి పంటకు బోనస్ ఇవ్వాలని కోరుతూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం తాసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. రైతులు పంటలకు పెట్టుబడి కోసం అప్పులు చేసి ఇబ్బందులకు గురవుతున్నా ప్రభుత్వం ఇప్పటి వరకు రైతు భరోసా వేయలేదని అన్నారు. మండల కార్యదర్శి వజ్జ శ్రీను, నాయకులు వెంకన్న, నర్సయ్య, విజయ్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన

శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, గ్రామస్తులు

మునగాల, ఫిబ్రవరి 21: మండలంలోని తాడువాయి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి హౌసింగ్ శాఖ అధికారి మూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాడువాయి గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా తీసుకొని ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్నామన్నారు. గ్రామానికి మొదటి విడుతలో 121 ఇండ్లు మంజూరు అయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేశ్ దీన్‌దయాల్, ఎంపీఓ దార శ్రీనివాస్ ఏఈ వసంత, కార్యదర్శి రామానాయక్ తదితరులు పాల్గొన్నారు.

డాబా పైనుంచి పడి యువకుడు మృతి

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 21: ప్రమాదవశాత్తు డాబా పైనుంచి కింద పడి యువకుడు మృతిచెందిన ఘటన హుజూర్‌నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ వనస్థలిపురంలోని చిత్రసీమ కాలనీకి చెందిన తుమ్మల పల్లి సాయిరాం (33) సినీ పరిశ్రమలో కెమెరామెన్‌గా పనిచేస్తున్నాడు. గురువారం తన మిత్రుడైన నవీన్‌తో కలిసి మిర్యాలగూడలో తన మామ సానునూరి నాగరాజు ఇంటికి వచ్చాడు. తిరిగి రాత్రి హుజూర్‌నగర్‌లోని తన బావ నరేశ్ ఇంటికి వచ్చాడు. ఇద్దరూ కలిసి నరేశ్ స్నేహితుడు ఎరుగంటి శ్రీనివాస్ ఇంటికి వెళ్లి మద్యం తాగుతుండగా ప్రమాదవశాత్తు సాయిరాం డాబా పైనుంచి కింద పడడంతో తలకు బలమైన గాయమై మృతి చెందాడు. కాగా, తన కుమారుడి మృతిపై అనుమానం ఉందని సాయిరాం తల్లి పద్మావతి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు.

సిమెంట్ బల్లాలు వితరణ

మఠంపల్లి, ఫిబ్రవరి 21: మండలంలోని యాతవాకిళ్ల గ్రామానికి చెందిన జువ్వాజి వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు నవీన్ స్థాపించిన జేవీఎల్ మెమోరియల్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామానికి సిమెంట్ బల్లాలను వితరణ చేశారు. కార్యక్రమంలో కుక్కల వెంకన్న, మట్టపల్లి ప్రవీణ్‌గౌడ్, మామిడి నాగయ్య, శ్రీను, మామిడి గురవయ్య పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మఠంపల్లి, ఫిబ్రవరి 21: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ పి.బాబు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం మండలంలోని చెన్నాయిపాలెంకు చెందిన భూక్య లక్ష్మణ్ అనే వ్యక్తి అక్రమంగా ట్రాక్టర్‌లో ఇసుకను రవాణా చేస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

'ఎర్రజెండాతోనే సమస్యల పరిష్కారం'

నేరేడుచర్ల, ఫిబ్రవరి 21: ఎర్రజెండాతోనే ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అనంత ప్రకాశ్ అన్నారు. రెడ్‌బుక్ డే సందర్భంగా శుక్రవారం స్థానిక అరిబండి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోషలిజం అనేది పగటి కలలు కనే వారి సృష్టికాదన్నారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి సిరికొండ శ్రీను, సీఐటీయూ నాయకులు నాలీ రామ్మూర్తి, సట్టు శ్రీను, కొండ లింగయ్య తదితరులు పాల్గొన్నారు

బీఆర్ఎస్ నాయకుల నివాళి

గరిడేపల్లి, ఫిబ్రవరి 21: మండలంలోని పరెడ్డిగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు వీరంరెడ్డి శంభిరెడ్డి సోదరుడు, బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు వీరంరెడ్డి అంజిరెడ్డి తండ్రి వీరారెడ్డి శుక్రవారం మృతిచెందగా.. మాజీ వైస్ ఎంపీపీ గుత్తికొండ ప్రమీలావెంకటరమణారెడ్డి వీరారెడ్డి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో మాజీ సర్పంచ్ కుక్కునూరు అంజయ్య, బీఆర్ఎస్ నాయకులు నట్టె సైదయ్య, మూలగుండ్ల ప్రతాప్ రెడ్డి, గుర్రం సీతారాంరెడ్డి, మైనార్టీ నాయకులు షేక్ దస్తగిరి, నగేశ్ ఉన్నారు.

'అర్హులకు ఇండ్లు ఇవ్వాలి'

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 21: రాష్ట్రంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు పల్లె వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెడ్‌బుక్ డే సందర్భంగా శుక్రవారం పట్టణంలో సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి నాయకుల సమావేశంలో ఆయన మాటాడారు. రానున్న రోజుల్లో సీపీఐ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో పోరాటాలు చేస్తామని తెలిపారు. బ్రహ్మం, సైదులు, వెంకటచంద్ర హుస్సేన్, బాలునాయక్ పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడువాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీవాణి

సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీవాణి

సూర్యాపేట లీగల్, ఫిబ్రవరి 21: యువత సన్మార్గంలో నడిచి దేశానికి దిక్సూచి కావాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎంఏఎం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. యువత చట్టం పట్ల అవగాహన కలిగి ఉండాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. సదస్సులో సూర్యాపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.సుదర్శన్‌రెడ్డి, కార్యదర్శి డి.మల్లయ్య, డిఫెన్స్ కౌన్సిల్ బి.వెంకటరత్నం, పి.వాణి, బి.ప్రవీణ్‌కుమార్, హెచ్ఎం యాకయ్య పాల్గొన్నారు.

'ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి'

తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆత్మకూర్.ఎస్, ఫిబ్రవరి 21: మండలంలోని ఏపూరు, రామన్నగూడెం వాగుల నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ సూర్యాపేట డివిజన్ కార్యదర్శి కొత్తపల్లి రేణుక ఆధ్వర్యంలో శుక్రవారం తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కొందరు రాత్రివేళల్లో ఇసుకను అక్రమంగా తరలించడమే కాకుండా అడిగిన వారిని బెదిరిస్తున్నారని ఆరోపించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర అఖిల్‌కుమార్, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు పేర్ల నాగయ్య, డివిజన్ నాయకులు ఎస్‌కే.గులాం హుస్సేన్, మాసిరెడ్డి నవీన్‌రెడ్డి, సామ సత్తిరెడ్డి, సామ మల్లారెడ్డి, గోగుల వీరబాబు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖ కార్యాలయం ఎదుట వ్యక్తి ఆత్మహత్నాయత్నం

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 21: హుజూర్‌నగర్ ఎక్సైజ్ శాఖ కార్యాలయం ఎదుట ఓ వ్యక్తి ఆత్మహత్నాయత్నానికి పాల్పడాడు. వివరాలిలా ఉన్నాయి.. మఠంపల్లి మండలం రామచంద్రపురం తండాకు చెందిన ఆంబోతు బాలాజీ అనే వ్యక్తి ఎక్సైజ్ శాఖ అధికారులు తనను వేధిస్తున్నారని ఆరోపిస్తూ శుక్రవారం హుజూర్‌నగర్ ఎక్సైజ్ కార్యాలయం ఎదుట పురుగు మందు తాగాడు. అది గమనించిన బాలాజీ స్నేహితుడు వెంటనే ఆసుపత్రికి తరలించడంతో చికిత్స అందించారు. ప్రస్తుతం బాలాజీ ఆరోగ్యం నిలకడగా ఉంది. కాగా, ఈ విషయంపై ఎక్సైజ్ శాఖ సీఐ నాగార్జునరెడ్డిని వివరణగా కోరగా.. బాలాజీపై తమ స్టేషన్ పరిధిలో ఎలాంటి కేసులు లేవని తెలిపారు. ఆత్మహత్నాయత్నానికి, తమకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు.

'టీబీ నివారణకు కృషి చేద్దాం'

మాట్లాడుతున్న మండల వైద్యాధికారి నరేశ్

గరిడేపల్లి, ఫిబ్రవరి 21: టీబీ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల వైద్యాధికారి వి.నరేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కాల్వపల్లి గ్రామంలో నిర్వహించిన నిక్షయ్ శివిర్ క్యాంపులో ఆయన పాల్గొని మాట్లాడారు. క్యాంపులో మొత్తం 38 మందికి తెమడ పరీక్షలు, ఎక్స్‌రే, తదితర పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. సోమవారం తాళ్లమల్కాపురం గ్రామంలో టీబీ వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ శారద, సూపర్‌వైజర్ అంజయ్యగౌడ్, వైద్య సిబ్బంది అశోక్‌సాయి, మమత, పంచాయతీ కార్యదర్శి సుమిత్ర, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి : తాసీల్దార్

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 21: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని